క్లుప్తంగా

హిందూ ధర్మ పరిరక్షణకు ముందుకురావాలి



రామలింగేశ్వరుడి సన్నిధిలో మారుతి కిరణ్ తదితరులు

కుల్కచర్ల: ఆలయాల అభ్యున్నతికి, హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనేటి పిలుపునిచ్చారు. బుధవారం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీపాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేకపూజలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సనాతన ఆచార సాంప్రదాయాలను గౌరవిస్తూ.. మన సంస్కృతిని మనమే పరిరక్షించుకోవాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాములు, కుల్కచర్ల మాజీ సర్పంచ్ జానకీరాం, నాయకులు మైపాల్, గడుసు మైపాల్, ఆంజనేయులు, ఆలయ అర్చకులు పాండు, అనంతమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

దౌల్తాబాద్: మాటూరు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. హెచ్‌ఎంగా మధు, తహసీల్దారుగా శ్రీనివాస్, ఎంపీడీఓగా అనూష, కలెక్టర్‌గా శేఖర్, ఎంఈఓగా శివలీలలతో పాటు మరికొంతమంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్య బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నర్మద



నర్మదకు నియామక పత్రం అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్

కొడంగల్: బీఎస్పీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా అంగడిరాయిచూర్ గ్రామానికి చెందిన నర్మదను నియమిస్తూ.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగడిరాయిచూర్ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ర్యాలపేట చెరువుకు మరమ్మతు చేయించాలి



తూముకు మరమ్మతు చేస్తున్న రైతులు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామ శివారులోని ర్యాలపేట చెరువుకు అధికారికంగా మరమ్మతు చేయించాలని సర్పంచ్ సయ్యద్ అంజద్, రైతులు కోరారు. బుధవారం తమ పొలాలకు నీరందించే చెరువుకు సంబంధించిన తూముకు రైతులు తాత్కాలికంగా మరమ్మతు చేశారు. చెరువులో నిండుగా నీరున్నా పొలాలకు నీరందించే తూము పనిచేయకపోవడంతో.. అడ్డుగా ఉన్న మొరం మట్టితో పాటు రాళ్లను తొలగించి.. నీరు వచ్చేవిధంగా చేశారు. సాగు చేసుకునేందుకు ప్రతిసారి తూమును మరమ్మతు చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతు చేయించాలని రైతులు కోరుతున్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి

కుల్కచర్ల: పాంబండ దేవాలయ ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నదానం చేసేందుకు గాను రాంపూర్ గ్రామ రేషన్ డీలర్ రాములు దంపతులు సుమారు 6వేల రూపాయల విలువైన సోనబియ్యాన్ని దేవాలయానికి బుధవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రాములు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు హిందూ ధర్మ పరిరక్షణకు, సేవాభావంతో ఆలయాల అభివృద్ధికి ముందుకు రావాలన్నారు. అందరి సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కడంపల్లి రఘు, లక్ష్మయ్య, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారీ బడుల్లో సమస్యలు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులంటూ చేస్తున్న ప్రచారం ఉత్తిదేనని ఈ పాఠశాలల దుస్థితి చూస్తే అర్థమవుతోంది. నిండా సమస్యలతో ఆయా బడులు కొట్టుమిట్టాడుతున్నాయి. టాయిలెట్స్, తదితర మౌలిక వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉన్నా.. నీరు లేక 'మరుగు'న పడ్డాయి. దీంతో వారందరూ ఆరుబయటకు వెళ్లక తప్పడం లేదు.

- వసతుల లేమితో కళతప్పిన విద్యాలయాలు
- నీరులేక నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు
- 237 మంది స్టూడెంట్స్ ఉన్నా.. టాయిలెట్స్ సున్నా..
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



పెద్దేముల్ మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన మరుగు దొడ్లు

పెద్దేముల్: పెద్దేముల్ మండలంలో మొత్తం 61 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ప్రైమరీ పాఠశాలల్లో 2,872 మంది, యూపీఎస్ పాఠశాలల్లో 1,399 మంది, ఉన్నత పాఠశాలల్లో 1,065 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా విద్యాలయాల్లో మూత్రశాలలు ఉన్నవి 60, కంపౌండ్ వాల్ ఉన్నవి 34, పూర్తి స్థాయిలో తరగతి గదులు ఉన్నవి 44, వంట గదులు ఉన్నవి 46, తాగునీటి వసతులు ఉన్నవి 50 స్కూల్స్ ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. కానీ ఏ ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిల్లో వసతులు లేవు. మరుగుదొడ్లు ఉంటే.. వంట గదులు లేవు. వంట గదులు ఉంటే మరుగుదొడ్లు లేవు. రెండు ఉన్నా నీటి సౌకర్యం సున్నా అని తెలుస్తోంది. ముఖ్యంగా కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో ఉన్న సర్కారు బడులకు పూర్తి స్థాయి వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులు ఉన్న పాఠశాలకు కేవలం ఒకటి, రెండు గదులు మాత్రమే ఉన్నాయి. అందులోనే ఉపాధ్యాయులు విద్యబోధిస్తున్నారు. మరి కొంత మంది ఆరు బయట పాఠాలు చెబుతున్నారు.

237 మందికి.. ఒక్క మరుగుదొడ్డి లేదు

కర్ణాటక–తెలంగాణ సరిహద్దుకు కిలో మీటరు దూరం, మండల కేంద్రానికి 18 కిలో మీటర్ల దూరంలో ఉన్న అడ్కిచెర్ల ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో సుమారు 237 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 40 మంది బాలికలు, 60 మంది బాలలకు ఒక మరుగు దొడ్డి ఉండాలి. కానీ.. ఈ పాఠశాలల్లో ఒక్క మరుగు దొడ్డి కూడా లేదు. గతంలో నిర్మించిన మరుగు దొడ్లు శిథిలావస్థకు చేరి, వినియోగించడానికి అనువుగా లేవు. దీంతో ఆ విద్యార్థులు ఆరుబయటకు వెళ్లక తప్పడం లేదు. బుద్దారం ప్రాథమిక పాఠశాలల్లో మూడేళ్ల నుంచి వంట గది నిర్మాణ పనులు మధ్యలో నిలచిపోయాయి. ఈ విషయాన్ని సర్పంచ్ లక్ష్మి మండల సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదు చేసినా.. ఏ అధికారి పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. పెద్దేముల్ బాలుర ఉన్నత పాఠశాలలో సుమారు 400లకు పైగా విద్యార్థులు ఉన్నా.. సరిపడా వంట గది లేదు. మూత్రశాలలు పూర్తిగా పాడయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి.. వంట గదులు, మరుగు దొడ్లు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముందుకు రాని పాలకులు

ఉపాధి హామీ (ఎన్‌ఆర్‌ఈజీఎస్) పథకం కింద ప్రభుత్వం మరుగు దొడ్లు, వంట గదులు మంజూరు చేసినా.. బిల్లులు సకాలంలో అందడం లేదంటూ పాలకులు, కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదు. పనులు చేసినా బిల్లులు అందక, తాము అప్పుల పాలవుతున్నామని పలువురు వాపోతున్నారు. దీంతో ప్రభుత్వం ముందుకు వచ్చి విద్యాలయాల్లో వసతుల ఏర్పాటుకు తగిన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సర్కారు బడుల సుందరీకరణకు ప్రభుత్వం మన ఊరు–మనబడి ద్వారా నిధులు విడుదల చేసి.. కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేయిస్తున్నప్పటికీ.. ఇక్కడి పాఠశాలల్లో ఆ ఊసే లేదని స్థానికులు చెప్పడం గమనార్హం.

మరుగుదొడ్లు నిర్మించాలి



సర్కారు బడుల్లో వంట గది, మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు ఉండాలి. ప్రైవేటు పాఠశాలల కంటే సర్కారు బడులు ముద్దు అని ఎలా అంటున్నారో.. అదే విధంగా మౌలిక వసతుల కల్పనకు తగిన చొరవ చూపాలి. అప్పుడే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది. విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుంది.

– లోంక నర్సింహులు, మాజీ సర్పంచ్ హన్మాపూర్

అధికారులకు రిపోర్టు చేశాం



మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంట గదులు, ప్రహరీ గోడలు, తాగునీరు లేని విషయాన్ని ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారులకు నివేదించాం. అడ్కిచెర్ల పాఠశాలలో వంట గది లేదు. ఉన్న మరుగు దొడ్లు శిథిలావస్థకు చేరాయి. మరి కొన్ని బడుల్లో సరిపడా తరగతి గదులు లేక.. ఒకే గదిలో విద్య బోధిస్తున్న విషయాన్ని సర్పంచ్‌లు తమ దష్టికి తీసుకొచ్చారు.

– వెంకటయ్య, ఎంఈఓ, పెద్దేముల్

ప్రహరీ లేని పాఠశాలలు

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వసతుల సంగతి ఎలా ఉన్నా.. కనీసం ప్రహరీ కూడా లేని విద్యాలయాలు ఎన్నో ఉన్నాయి. మండలంలో మొత్తం 51 పాఠశాలలు ఉండగా.. వీటిలో 45 ప్రాథమిక, 8 ఉన్నత, 8 ప్రాథమికోన్నత బడులు ఉన్నాయి. వాటిల్లో మొత్తం 5,275 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలు పోగా వాటిల్లో కేవలం 10 పాఠశాలకు మాత్రమే ప్రహరీలు ఉన్నాయి. మరో రెండు మూడింటికి అసంపూర్తిగా ఉన్నాయి.

చదువుకు ఆటంకం

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతో పాటు గోకఫసల్‌వాద్, ఈర్లపల్లి, తిమ్మారెడ్డిపల్లి, గుండేపల్లి, తిమ్మాయిపల్లి, గుముడాల, ఇండాపూర్, నందారం, సుల్తాన్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రహరిగోడ లేక.. ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. తరగతులు జరిగే సమయంలో విద్యాలయాల ఆవరణలో మూగజీవాలు సంచరించడం వలన చదువుకు ఆటంకం కలుగుతోంది. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు.. వాటికి మేతగా మారుతున్నాయి. ఇక సెలవు దినాలు, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి పాఠశాలలకు ప్రహరీ గోడలు నిర్మించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రహరీ లేని గుండేపల్లి పాఠశాల

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

పరిగి: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అరవింద్‌రావు చెప్పారు. మండల పరిధిలోని బసిరెడ్డిపల్లిలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ఎక్కడ సమస్యలు ఉన్నా.. వెంటనే పాలకవర్గం దృష్టికి తీసుకురావాలని, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.6 లక్షలతో సీసీరోడ్డు

బొంరాస్‌పేట: మండలంలోని రేగడిమైలారం లోని పలు కాలనీల్లో రూ.6 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఎంపీటీసీ జగదీశ్వరయ్య, సర్పంచ్ రాజేశ్వరితో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వానాకాలం బురదమయంగా ఉండే రోడ్లు.. సీసీల నిర్మాణంతో గ్రామానికి కొత్తకళ వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి, పార్టీ నాయకులు బలిజ శేఖర్, శ్యామలయ్యగౌడ్, పెద్ద నర్సింహులు, కె. నర్సింహులు, దాసరి రాములు, ఉపసర్పంచ్ శేఖర్, వార్డు సభ్యులు శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

దోమ: గొడుగోనిపల్లి గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద ఏర్పడిన భారీగా గుంతలను తన సొంత ఖర్చులతో గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి బుధవారం జేసీబీ సహాయంతో పూడ్చి వేయించారు. వాహనదారులకు ఇబ్బందిగా మారిన గుంతలను పూడ్చడంతో పలువురు ఆ యువకున్ని అభినందించారు.

అగ్గితెగులు నివారణకు జాగ్రత్తలు..

బొంరాస్‌పేట: అగ్గితెగులు నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని కొడంగల్ ఏడీఏ శంకర్ అన్నారు. దుద్యాల మండల పరిధిలోని నాజీఖాన్‌పల్లిలో బుధవారం యాసంగిలో వేసిన వరి పంటను పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో అగ్గితెగులు నివారణకు జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచించారు. నివారణకు 0.6గ్రా. ట్రైసైక్లోజోల్ లేదా 1.5మి.లీ. ఐసోప్రోథైయోలిన్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని ఏడీఏ సూచించారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి

తాండూరు టౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన జునేద్ కొంత కాలంగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం హైదరాబాద్‌లో లబ్ధిదారు కుటుంబ సభ్యులకు రూ.లక్ష ఎల్‌ఓసీని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజా సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఆర్థికంగా చితికి పోయిన పేదలకు కార్పొరేట్ వైద్యం అందజేయాలనే ఉద్దేశంతో వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిధులు మంజూరు చేయడం గర్వకారణమన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా నేరుగా తనను సంప్రదించాలని సూచించారు.



లబ్ధిదారు కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా కాన్షీరాం జయంతి



కాన్షీరాంకు నివాళులర్పిస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్: పాలితులుగా ఉన్న వారిని పాలకులుగా చేసిన ఘనత కాన్షీరాందేనని అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్‌బాబు చెప్పారు. కాన్షీరాం జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలను పాలకులుగా మార్చి, రాజ్యాధికారం దక్కించిన మహనీయుడు కాన్షీరాం అని కొనియాడారు. కార్యక్రమంలో చిన్నయ్య, నర్సింహ, పరశురాం, పకీరప్ప, తిరుమలేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆయన అడుగుజాడల్లో నడవాలి

నవాబుపేట: ప్రతి ఒక్కరు కాన్షీరాం అడుగుజాడల్లో నడవాలని నారెగూడ సర్పంచ్ పర్మయ్య అన్నారు. కాన్షీరాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత శివరాజ్, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పురుషోత్తం, గ్రామ పెద్దలు అనంతయ్య, పర్మయ్య, హన్మయ్య, కృష్ణ, శివకుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సల్లంగ చూడు మైసమ్మ తల్లీ



బోనాలతో భక్తులు

పెద్దేముల్: వరుణ దేవుడు కరుణించి పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో చల్లంగ ఉండాలంటూ మైసమ్మ తల్లిని భక్తులు వేడుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా బుధవారం మారేపల్లి గ్రామస్తులు మినీ మైసమ్మకు బోనమెత్తారు. ప్రత్యేక పూజలు చేసి మెక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతు రాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మారేపల్లితో పాటు జనగాం, మంబాపూర్, తాండూరు, పెద్దేముల్, ఇందోల్, ఓగ్లాపూర్‌తో పాటు పలు గ్రామాల ప్రజలు ఉత్సవంలో పాల్గొన్నారు.

ఇంటింటికీ టీడీపీ

దౌల్తాబాద్: నీటూరు, చంద్రకల్, కుప్పగిరి గ్రామాల్లో బుధవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకట్‌ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీకి పూర్వవైభవం తీసుకవస్తామని చెప్పారు. టీడీపీ బడుగు బలహీన వర్గాల పార్టీ అని, ప్రతి గ్రామంలో దేశానికి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కిష్టప్ప, చంద్రప్ప, నర్సప్ప, హనుమంతు, గుండప్ప, సాయన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

20న తైబజార్ బహిరంగ వేలం

కొడంగల్: తైబజార్‌ను ఈనెల 20వ తేది ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 18న సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఏప్రిల్ ఒకటో తేది నుంచి ఒక సంవత్సర కాలపరిమితికి వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మరిన్ని విషయాల కొరకు మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

డైరీ ఆవిష్కరణ

అనంతగిరి: తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరియన్ అసోసియేషన్ 2023 డైరీని బుధవారం జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ ఆవిష్కరించారు. ఏడీ డాక్టర్ ప్రహల్లాద్, డాక్టర్ సదానందం, జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి షేక్ ఇబ్రహీం, కోశాధికారి జహంగీర్, అసోసియెట్ అధ్యక్షుడు సురేందర్ నాయక్, శ్యాంరావు, రహీం పాల్గొన్నారు.

మహిళా శక్తిని మించింది లేదు

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప

తాండూరు టౌన్: మహిళా శక్తిని మించింది లేదని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా బుధవారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు మహిళా సమాఖ్య సభ్యులతో కలిసి ఆమె కేక్ కట్‌చేశారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే సాధించనిదంటూ ఏదీ లేదన్నారు. మహిళా శక్తికి విజ్ఞానం ఎంతో అవసరమని, బాలికలకు తప్పకుండా ఉన్నత విద్యను అందించేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. వంటింటి నుంచి దేశాన్ని పరిపాలించే స్థితికి మహిళలు చేరుకున్నారని, రాజకీయాల్లో పురుషులతో సమానంగా వారికి అవకాశాలు కల్పించాలన్నారు. ఆమెపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలను మూకుమ్మడిగా ఖండించాలని చెప్పారు. ఇలాంటి వాటిని ఎదుర్కొనేందుకు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యాపారం, క్రీడలు, రాజకీయ తదితర రంగాల్లో మహిళలు ఉన్నత స్థానంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కొత్రిక విజయలక్ష్మి, కల్వ సుజాత పాల్గొన్నారు.



వార్డు మహిళలకు కేకు తినిపిస్తున్న వైస్ చైర్‌పర్సన్ దీప

తొలిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

- ఉదయం 8 గంటలకే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
- నిమిషం నిబంధన అమలు
- ఆలస్యంగా వచ్చిన ఆరుగురికి నో ఎంట్రీ



తాండూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

తాండూరు: ఇంటర్మీడియెట్ ప్రథమ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తాండూరు నియోజకవర్గంలో మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులకు అధ్యాపకులు, పోలీసు అధికారులు సలహాలు, సూచనలు ఇచ్చారు. 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాశారు. తాండూరులో మొత్తం 2,749 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 2,636 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 113 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 2,111 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ఇందులో 2,028 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 83 మంది రాలేదు. ఒకేషనల్ విభాగంలో 638 మంది ఎగ్జామ్ రాయాల్సి ఉండగా.. 608 మంది మాత్రమే రాశారు. 30 మంది గైర్హాజరయ్యారు. ఇదిలా ఉండగా.. నిమిషం నిబంధనలు అధికారులు పక్కాగా అమలు చేశారు. 9 గంటల తరువాత పరీక్ష కేంద్రానికి వచ్చిన ఆరుగురు విద్యార్థులను అనుమతించలేదు.

జిల్లా వ్యాప్తంగా 8,064

వికారాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా 8,064 మంది జనరల్ విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 7,752 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 312 మంది ఆబ్సెంట్ అయ్యారు. ఒకేషనల్‌లో 1,427 మంది హాజరు కావాల్సి ఉండగా 1,348 మంది వచ్చారు. 79 మంది రాలేదు.

11 మంది గైర్హాజర్

పెద్దేముల్: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 315 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. అందులో 15 మంది గైర్హాజరయ్యారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఇంటర్ ఫస్టియర్ తెలుగు, హిందీ, ఉర్దూ పరీక్షలు జరిగాయి. 616 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 17 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.

భారీగా గైర్హాజరు

కుల్కచర్ల: వివేకానంద కళాశాలలో 192 మంది విద్యార్థులకు గాను 26మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శ్రీరామలింగేశ్వర ఇంటర్, డిగ్రీ కళాశాలలో 317మందికి గాను 20 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు.

పరిగిలో..

పరిగి: పట్టణ కేంద్రంలో 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో పరీక్ష రాయాల్సిన 1,270 మంది విద్యార్థులకు గాను 1,224 మంది హాజరయ్యారు. 46 మంది రాలేదు. ఒకేషనల్‌లో 323 మందికి గాను 313 మంది రాగా.. 10 మంది రాలేదు.

దోమలో..

దోమ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 225 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 217 మంది మాత్రమే రాశారు. మిగతా ఏడుగురు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు.



పరిగి: విద్యార్థులను సోదా చేస్తున్న పరిశీలకులు



దోమ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాల్ టికెట్ నంబర్ సరిచూసుకుంటున్న విద్యార్థులు



తాండూరు: సింధు బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు